సాక్షి
విశాఖపట్నం
శనివారం । 23 । ఆగస్టు । 2025



కానిస్టేబుల్ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన 8లో



విశాఖలో 'సుందరకాండ' సందడి 8లో



స్పెషల్ రైళ్లు మరికొంతకాలం పొడిగింపు 8లో

న్యూస్‌రీల్

అప్పన్నను దర్శించుకున్న నటి అనసూయ



కుటుంబసమేతంగా కప్పస్తంభానికి మొక్కుకుంటున్న నటి అనసూయ

సింహాచలం : ప్రముఖ సినీ నటి, యాంకర్ అనసూయ శుక్రవారం కుటుంబంతో కలిసి సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని దర్శించుకున్నారు. ఆలయ సంప్రదాయం ప్రకారం ఆమె కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. అనంతరం అనసూయ దంపతుల పేరిట అర్చకులు అంతరాలయంలో అష్టోత్తర పూజ నిర్వహించి, వేదాశీర్వచనం అందజేశారు. ఆలయ అధికారులు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రం అందజేసి సత్కరించారు. శ్రావణ శుక్రవారం సందర్భంగా సింహగిరిపై నిర్వహించిన సామూహిక వరలక్ష్మీ వ్రతాలను కూడా అనసూయ కొంతసేపు తిలకించారు.

గ్లోబల్ రన్నరప్‌గా హిరణ్య



గోపాలపట్నం: వియత్నాంలో జరిగిన అంతర్జాతీయ అందాల పోటీల్లో విశాఖకు చెందిన బొడ్డేటి డింపుల్ హిరణ్య ఐదో స్థానాన్ని కైవసం చేసుకుంది. ఈ విజయం ద్వారా ఆమె 'గ్లోబల్ రన్నరప్'గా నిలిచింది. పదిహేనేళ్లలోపు బాలికల కోసం నిర్వహించిన ఈ పోటీల్లో ప్రపంచ స్థాయిలో ఐదవ స్థానం సాధించడం చాలా గొప్ప విషయమని హిరణ్య తల్లి ప్రవల్లిక తెలిపారు. వియత్నాం నుంచి విశాఖ చేరుకున్న హిరణ్య, భవిష్యత్తులో ప్రపంచ సుందరిగా విజయం సాధించి దేశానికి పేరు తీసుకువస్తానని తెలిపింది.

లడ్డూ విక్రయాలు పునఃప్రారంభం

కొమ్మాది: రుషికొండలోని శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం (తితిదే)లో శ్రీవారి లడ్డూ విక్రయాలు పునఃప్రారంభమయ్యాయి. ఇటీవల తిరుపతిలో భారీ వర్షాల కారణంగా రవాణాకు అంతరాయం ఏర్పడి, లడ్డూ విక్రయాలు వారం రోజుల పాటు నిలిచిపోయాయి. ప్రస్తుతం పరిస్థితులు సాధారణ స్థితికి రావడంతో లడ్డూలు ఆలయానికి చేరుకున్నాయి. దీంతో శుక్రవారం నుంచి భక్తులకు లడ్డూల విక్రయాలు తిరిగి ప్రారంభించినట్లు ఆలయ ఏఈవో జగన్మోహనాచార్యులు తెలిపారు.

ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో డ్రైవింగ్ శిక్షణ

ఎంవీపీకాలనీ: జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో హెవీ మోటార్ వెహికల్ డ్రైవింగ్‌లో శిక్షణ ఇవ్వనున్నారు. ఈ మేరకు ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సత్యపద్మ శుక్రవారం ఓ ప్రకటనలో వివరాలు వెల్లడించారు. 20 ఏళ్లు పైబడిన ఎస్సీ స్త్రీ, పురుషులు ఈ శిక్షణకు అర్హులు. అర్హత గల అభ్యర్థులు ఈ నెల 27వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తులను ఎంవీపీ కాలనీలోని జిల్లా ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయంలో సమర్పించాలని ఆమె సూచించారు.

26న విశాఖలో పబ్లిక్ హియరింగ్

మహారాణిపేట: జాతీయ మహిళా కమిషన్ సభ్యురాలు డాక్టర్ అర్చన మజుందార్ అధ్యక్షతన ఈ నెల 26న విశాఖలో 'రాష్ట్రీయ మహిళా ఆయోగ్ ద్వార్ మహిళా జన సున్వాయ్' పేరుతో పబ్లిక్ హియరింగ్ నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ తెలిపారు. జిల్లా పరిషత్ సీఈవో పి.నారాయణ మూర్తి శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో ఈ పబ్లిక్ హియరింగ్ ఆ రోజు ఉదయం 10 గంటలకు జిల్లా పరిషత్ సీఈఓ కార్యాలయంలో జరుగుతుందని తెలిపారు. మహిళల హక్కుల పరిరక్షణకు జరుగుతున్న కృషిలో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఈ-సిగరెట్లు విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

మద్దిలపాలెం: కంచరపాలెం సమీపంలోని అక్రమంగా ఈ-సిగరెట్లు విక్రయిస్తున్న ఒక వ్యక్తిని కంచరపాలెం పోలీసులు అరెస్టు చేశారు. బండి శ్రీకాంత్ అనే వ్యక్తి ధర్మానగర్‌లోని తన పాన్‌షాపులో ఈ-సిగరెట్లు అమ్ముతున్నాడని వచ్చిన సమాచారం మేరకు, టాస్క్‌ఫోర్స్, కంచరపాలెం పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. శ్రీకాంత్ పాన్‌షాపులో రూ. 56,000 విలువ చేసే 60 ఈ-సిగరెట్లను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితుడిని అరెస్టు చేశారు. ఇదిలా ఉండగా ఈ వ్యవహారంలో ఓ కానిస్టేబుల్ పాత్ర ఉన్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అడ్డంగా బుక్కైన మేయర్

- విరుచుకుపడ్డ కూటమి కార్పొరేటర్లు
- కౌన్సిల్లో కోళ్ల వ్యర్థాలపై రగడ..
- అధికారపార్టీ కార్పొరేటర్ల నిలదీత
- స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్సార్ సీపీ కార్పొరేటర్ల గళం..



మేయర్ పోడియం ముందు బైఠాయించిన వైఎస్సార్ సీపీ, సీపీఎం, సీపీఐ కార్పొరేటర్లు

డాబాగార్డెన్స్ : కోళ్ల వ్యర్థాల తరలింపును అడ్డుకోవడానికి ప్రయత్నించిన తనపైనే ఆరోపణలు చేయిస్తున్నారని స్వయంగా టీడీపీ కార్పొరేటర్ గంధం శ్రీను ఆరోపించారు. జీవీఎంసీలో ఒక అధికారి కిశోర్ ఏళ్లుగా తిష్టవేసి కూర్చున్నారని, ఆయన తీరు బాగోలేదని ఎండగట్టారు. మేయర్ అవినీతిపై సొంత పార్టీ కార్పొరేటర్ నుంచే విమర్శలు రావడంతో మేయర్ పరిస్థితి ఇబ్బందికరంగా మారింది. దీంతో చేసేదేమీ లేక చర్యలు తీసుకుంటానని బెదిరించే ప్రయత్నం చేయడం విమర్శలకు దారి తీసింది.

కోళ్ల వ్యర్థాల దందా కూటమి నేతలదే!
(సాక్షి ఇటీవలే ఈ కథనాన్ని ప్రచురించింది)

జీవీఎంసీ పరిధిలో కోళ్ల వ్యర్థాలను సేకరించి కాపులుప్పాడకు తరలించాలి. ఇందుకోసం 8 జోన్లకు ఒక్కొక్కరి చొప్పున మొత్తం 8 మంది కాంట్రాక్టర్లకు పనులు అప్పగించారు. అయితే కూటమి కి చెందిన కొందరు నేతలు సొంతంగా వాహనాలను ఏర్పాటు చేసుకుని కోళ్ల వ్యర్థాలను సేకరించి చేపలు, రొయ్యల చెరువులకు తరలిస్తున్నారు. ఈ విషయంపై ఫొటోలతో సహా కార్పొరేటర్లు ఫిర్యాదు చేసినా, అధికారులు ఆ వాహనాలను పట్టుకుని మళ్లీ వదిలేయడం పరిపాటిగా మారింది. ఈ వ్యవహారంలో కీలకమైన కూటమి ఎమ్మెల్యేలతో పాటు, తెర వెనుక ఉండి రౌడీషీటర్ల ద్వారా వ్యవహారం నడిపిస్తున్న జీవీఎంసీలోని కీలక నేత తీరుపైనా అనేక ఆరోపణలు వచ్చాయి. ఈ దందాకు జీవీఎంసీలో ఏళ్ల నుంచి పని చేస్తున్న ఒక అధికారి తీరుపైనా కౌన్సిల్‌లో విమర్శలు వ్యక్తమయ్యాయి. కోళ్ల వ్యర్థాల దందాపై సొంత పార్టీ నుంచే విమర్శలు వస్తుండటంతో, మేయర్ తన పదవి గౌరవాన్ని కూడా విస్మరించి ప్రవర్తించడం చర్చనీయాంశమైంది. ఈ విషయంలో విచారణ జరపకుండా ఆరోపణలు చేస్తున్న వ్యక్తులను బెదిరించడంతో మేయర్ వ్యవహారశైలిపై విమర్శలు వెల్లువెత్తాయి. ఇదే అంశంపై వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు చర్చ జరపాలని పట్టుబట్టారు.

సొంత పార్టీలోనే విపక్షం : కోళ్ల వ్యర్థాల అక్రమ తరలింపుపై శుక్రవారం జరిగిన జీవీఎంసీ కౌన్సిల్ సమావేశంలో తీవ్ర గందరగోళం నెలకొంది. ఈ తరలింపులో రౌడీషీటర్ల ప్రమేయం ఉందని టీడీపీ కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు ఆరోపించారు. గంధం శ్రీనివాసరావుతో పాటు టీడీపీ కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి, వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్ చెన్నా జానకీరామ్ సహా మరికొంతమంది కార్పొరేటర్లు ఈ వ్యవహారంపై అధికారులను నిలదీశారు. ఒకే అధికారి చాలాకాలంగా జీవీఎంసీలో పనిచేస్తూ రౌడీషీటర్లకు సహకరిస్తున్నారని ఆరోపించారు. అధికారులు ఇచ్చిన వివరణపై సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేయడంతో కమిషనర్ కేతన్ గార్గ్ జోక్యం చేసుకున్నారు. తాను బాధ్యతలు స్వీకరించాక పత్రికల్లో ఈ విషయమై అనేక కథనాలు చూశానని, తప్పిదాలు ఉన్నట్టు తెలుస్తోందని, కచ్చితంగా చర్యలు తీసుకుంటామన్నారు.



నిరసన తెలుపుతున్న వైఎస్సార్ సీపీ ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు

మేయర్ వర్సెస్ గంధం

కోళ్ల వ్యర్థాల అంశంపై కార్పొరేటర్ గంధం శ్రీను మాట్లాడుతున్నప్పుడు మేయర్ పీలా శ్రీనివాసరావు అడ్డుకున్నారు. తాను ఒక అక్రమ వాహనాన్ని పట్టుకుని అధికారులు, పోలీసులకు సమాచారం ఇచ్చానని, దీన్ని దృష్టిలో పెట్టుకుని అనకాపల్లిలో ఒక వ్యక్తి తన వాహనాన్ని అడ్డుకుని, అక్కడి సిబ్బందితో తనపై ఆరోపణలు చేయించి, సోషల్ మీడియాలో పెట్టారని గంధం శ్రీను చెప్పారు. 'సమయం వృథా అవుతోంది, మిగతా అంశాల్లోకి వెళ్దాం' అని మేయర్ పీలా చెప్పగా, గంధం మండిపడ్డారు. దీనిపై చర్చ జరగాల్సిందేనని ఆయన పోడియం వైపు దూసుకుపోయారు. 'కూర్చోకపోతే చర్యలు తీసుకుంటా' అంటూ మేయర్ హెచ్చరించారు. 'నువ్వు అధికార పార్టీ సభ్యుడివై ఉండి ఇలాగే మాట్లాడుతావా?' అంటూ మేయర్ మండిపడ్డారు.

సభ జరిగిన తీరిది..

ఉదయం 11 గంటలకు కౌన్సిల్ సమావేశం ప్రారంభమైంది. అజెండాలో 84 అంశాలు, టేబుల్ అజెండాలో 67 అంశాలు చర్చకు వచ్చాయి. మొత్తం 151 అంశాల్లో కేవలం రెండు అంశాలు మాత్రమే వాయిదా పడ్డాయి. ఒక్కో అంశానికి 5 నిమిషాలు చర్చించినా, సుమారు 750 నిమిషాలు (దాదాపు 12-13 గంటలు) పడుతుంది. కానీ అలా జరగకుండా తూతూ మంత్రంగా నిర్వహించి 149 అంశాలను ఆమోదించారు.



మేయర్ వైఫల్యం

సభను సజావుగా నిర్వహించడంలో మేయర్ పీలా శ్రీనివాసరావు విఫలమయ్యారు. ఒక అంశంపై చర్చ వచ్చినప్పుడు మేయర్ నుంచి ఆమోదం రాకపోతే ప్రతిపక్ష పార్టీ సభ్యులు ఆందోళన చేపట్టడం సాధారణం. ఆందోళన చేపట్టే సభ్యులతో మేయర్‌గా హుందాగా వ్యవహరించాల్సిన పీలా శ్రీనివాసరావు, ఆ హోదా గౌరవానికి భంగం కలిగించారు. సభ్యులను ఇష్టానుసారంగా మాట్లాడడం, సభలో సభ్యులు మేయర్‌కు గౌరవం ఇవ్వకుండా మాట్లాడడం చూస్తుంటే కౌన్సిల్ ఒక ఫంక్షన్‌లా మారిందనిపించింది. ఒక సభ్యుడు తన వార్డు సమస్యను చెప్పుకునేందుకు కూడా అవకాశం లేకుండా పోయింది. గతంలో ఏ మేయర్ కూడా ఇంతగా దిగజారి సభను నడపలేదనే ఆరోపణలు కూటమి పార్టీ కార్పొరేటర్లు కూడా బహిరంగంగా చేశారు. చివరకు కమిషనర్ కేతన్ గార్గ్ జోక్యం చేసుకుని సభ్యులను వారి సీట్లలో కూర్చోమని చెప్పడం మేయర్ వైఫల్యానికి నిదర్శనం.

బ్లాక్‌లిస్ట్‌లో ఉన్న సంస్థకు పనులా?

విజయవాడలో బ్లాక్‌లిస్ట్‌లో పెట్టిన ఒక సంస్థకు పనులు అప్పగించేలా ఒకేసారి రెండు సంవత్సరాలకు స్వీపింగ్ యంత్రాల మరమ్మతు పనుల అంచనాలను రూపొందించడంపై ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాంటి సంస్థకు పనులు అప్పగించేందుకు అనుకూలంగా నిర్ణయాలు ఎలా తీసుకుంటారని విమర్శించారు. అయితే, ఎలాగైనా ఈ అంశాన్ని ఆమోదింపజేయాలని మేయర్ ప్రయత్నించారు. సభ నుంచి తీవ్ర వ్యతిరేకత రావడంతో, తిరిగి ఒక ఏడాదికి అంచనాలు రూపొందించేందుకు కౌన్సిల్ నిర్ణయించింది.

వీటిపై అసలు చర్చేలేదు

టీడీఆర్‌ల జారీ, కోడి వ్యర్థాల సేకరణ, డంపింగ్, స్మార్ట్ సిటీ ప్రాజెక్టులు, కేటాయింపులు, అర్బన్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ సంబంధిత అంశాలు, రెవెన్యూ షాపుల కాంట్రాక్ట్, జీ-20 పనులు, బహిరంగ టెండర్లు, పార్కులు, ఖాళీ స్థలాల ఆక్రమణలు, రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్స్ హక్కుల రక్షణ, పాత జైల్ రోడ్డులో రాత్రి పూట ఫుడ్ కోర్టు, ప్రత్యేక కమిటీల నియామకాలు, ప్రస్తుత ఆస్తి పన్ను రీసర్వే వంటి ముఖ్యమైన అంశాలున్నప్పటికీ, కేవలం మొదటి నాలుగు అంశాలు మాత్రమే చర్చించి మిగిలిన వాటిని వదిలేశారు.

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కౌన్సిల్ ఆమోదం తెలపాలి

వైఎస్సార్‌సీపీకి చెందిన కార్పొరేటర్లు, మాజీ మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, డిప్యూటీ మేయర్ కట్టుమూరి సతీష్, మాజీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, జీవీఎంసీ వైఎస్సార్‌సీపీ ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లూ శంకరరావుతో పాటు వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు, సీపీఎం కార్పొరేటర్ డాక్టర్ బొడ్డు గంగారావు, సీపీఐ కార్పొరేటర్ ఏజే స్టాలిన్ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కౌన్సిల్ ఆమోదం తెలపాలని పెద్ద ఎత్తున పట్టుబట్టారు. నల్ల దుస్తులు ధరించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఉదయం 11 గంటలకు ప్రారంభమైన నిరసన దాదాపు రెండు గంటల పాటు సాగింది. చివరకు మేయర్ దిగివచ్చి, మీరు లేఖ ఇవ్వండి, ప్రభుత్వానికి పంపుతానని చెప్పారు.

టీడీఆర్‌లపై గందరగోళం

టీడీఆర్‌ల జారీపై సభ్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. జీవీఎంసీ పరిధిలో ఎన్ని మురికివాడలున్నాయి, రోడ్డు విస్తరణ, అభివృద్ధి పనుల్లో ఎంత మంది నష్టపోయారు, ఎంత మందికి టీడీఆర్‌లు జారీ చేశారు, అసలు నిబంధనలేంటి? ఉడా లేఅవుట్లకు కూడా జీవీఎంసీ అధికారులు ఎలా టీడీఆర్‌లు ఇచ్చేశారు? చివరకు శ్మశానానికి కూడా టీడీఆర్ ఇచ్చేశారంటే అధికారులు ఏ స్థాయిలో ఉన్నారో అర్థమవుతోందని పలువురు సభ్యులు విమర్శించారు. టీడీఆర్‌లకు సంబంధించి ఆన్‌లైన్‌లో 4200 దరఖాస్తులు నమోదైనట్లు తెలిసింది. దీనికి సంబంధించి పలువురు సభ్యులు అధికారులపై మండిపడుతూ వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఒప్పుకోం 8లో

స్పోర్ట్స్ మీట్.. క్రీడాకారులకు షాక్



నేలపై క్రీడాకారుల అవస్థలు

- కనీస సౌకర్యాలు కల్పించలేదంటూ క్రీడాకారుల పెదవి విరుపు
- అమరావతి చాంపియన్ షిప్ పోటీల్లో అగౌరవపరిచారని ఆవేదన



పోటీలు ప్రారంభిస్తున్న అతిథులు

మధురవాడ: విశాఖను గచ్చిబౌలి తరహాలో క్రీడా హబ్‌గా అభివృద్ధి చేస్తామని, అందులో మధురవాడ కొమ్మాది కీలకమని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, శాప్ చైర్మన్ రవినాయుడు పేర్కొన్నారు. కొమ్మాది శాప్ స్టేడియంలో అమరావతి చాంపియన్ షిప్ పోటీలతో నిర్వహించిన జోన్-1 పోటీల ప్రారంభోత్సవంలో నిర్వహణ లోపాలు క్రీడాకారులను అసౌకర్యానికి గురిచేశాయి. ఉమ్మడి విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల నుంచి వచ్చిన దాదాపు 1800 మంది క్రీడాకారులకు కనీస సదుపాయాలు కల్పించలేదు. తాత్కాలిక మరుగుదొడ్లకు నీరు లేకపోవడం, సరైన నిర్వహణ లేకపోవడంతో వారు ఇబ్బందులు పడ్డారు. సభలో క్రీడాకారులు నేలపైన కూర్చోవాల్సి వచ్చింది.

ప్రోటోకాల్ ఉల్లంఘనపై ఆగ్రహం

ఈ కార్యక్రమంలో సీనియర్ క్రీడాకారులను సత్కరించే క్రమంలో ప్రోటోకాల్ పాటించలేదని వెటరన్ క్రీడాకారులు ఆవేదన వ్యక్తం చేశారు. వేదికపై క్రీడా అధికారులకు మాత్రమే చోటు కల్పించి, క్రీడాకారులను నిర్లక్ష్యం చేశారని వారు విమర్శించారు. అంతే కాకుండా, టీడీపీ ఫ్లెక్సీల తరలింపు కోసం జీవీఎంసీ వాహనాలను ఉపయోగించడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు.

అభివృద్ధి హామీలు

సభలో గంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ, ఈ స్టేడియాన్ని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తామని, దక్షిణాదిలో మొదటి దివ్యాంగుల స్టేడియం ఇక్కడ నిర్మిస్తామని చెప్పారు. ఈ నెల 29న విజేతలకు ముఖ్యమంత్రి చేతుల మీదుగా బహుమతులు అందజేస్తామన్నారు. త్వరలో ఇక్కడ అకాడమీని పునఃప్రారంభిస్తామని శాప్ చైర్మన్ రవినాయుడు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గంటా రవితేజ, శాప్ డైరెక్టర్లు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

64 కేసుల్లో 66 మంది నిందితుల అరెస్ట్

- 1.26 కేజీల బంగారం, 1.92 కేజీల వెండి స్వాధీనం
- 1.20 కోట్ల విలువైన సొత్తు రికవరీ



బాధితులకు సొత్తును అందజేస్తున్న సీపీ బాగ్చీ

విశాఖ సిటీ: నగరంలో నేరాల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలు మంచి ఫలితాలను ఇస్తున్నాయని పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి తెలిపారు. శుక్రవారం పోలీస్ సమావేశ మందిరంలో నిర్వహించిన 'రికవరీ మేళా'లో ఆయన ఈ వివరాలను వెల్లడించారు. జూలై నెలలో నగరంలో 101 చోరీ కేసులు నమోదవ్వగా, వాటిలో 64 కేసులను ఛేదించి 66 మంది నిందితులను అరెస్టు చేసినట్లు ఆయన చెప్పారు. వారి నుంచి రూ.14,32,350, 1.26 కిలోల బంగారం, 1.92 కిలోల వెండి, 15 బైక్‌లు, 2 కార్లు, ఒక ఆటో, 259 మొబైల్ ఫోన్లు సహా ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మొత్తంగా రూ.1,20,58,150 విలువైన సొత్తును రికవరీ చేశామని పేర్కొన్నారు. నేరాల నియంత్రణలో భాగంగా జూలై నెలలో నగరంలో 374 సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు ఆయన వెల్లడించారు. నేరాలు ఎక్కువగా నమోదవుతున్న ప్రాంతాల్లో రాత్రి, పగలు ప్రత్యేక పెట్రోలింగ్‌ను నిర్వహిస్తున్నామని వివరించారు. అనంతరం, బాధితులు పోగొట్టుకున్న సొత్తును వారికి అందజేశారు. కార్యక్రమంలో డీసీపీ (క్రైమ్) లతా మాధురితో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

22ఏ భూములకు మోక్షమెప్పుడో?

- 22 ఏ నుంచి తొలగించాలని కోరుతూ కలెక్టరేట్ చుట్టూ ప్రదక్షిణలు
- కూటమి సర్కారులో పలుకుబడి ఉంటేనే ఫైళ్ల క్లియర్
- జిల్లా యంత్రాంగం వద్ద 80 వరకు ఫైళ్ల పెండింగ్

మహారాణిపేట: జిల్లాలో 22ఏ జాబితాలో చేర్చిన భూముల సమస్య రోజురోజుకూ తీవ్రమవుతోంది. ఈ భూములను జాబితా నుంచి తొలగించడానికి అధికారులు సాహసించడం లేదు. ఐఏఎస్ అధికారులు కూడా 22ఏ ఫైల్ అంటే భయపడుతున్నారని, జిల్లాలో ఈ ఏడాది దాదాపు 80 ఫైళ్లు పెండింగ్‌లో ఉన్నాయని సమాచారం.

22ఏ ఫైల్ అంటేనే రెవెన్యూ శాఖలో ఒక రకమైన భయం నెలకొంది. ఈ ఫైళ్లను ముట్టుకోవడానికి ఎవరూ ఇష్టపడడం లేదు. ఒత్తిడి ఎక్కువగా ఉంటే ఏదో ఒక కారణం చూపించి రిజెక్ట్ చేస్తున్నారు. గతంలో ఫైళ్లు పెండింగ్‌లో ఉంచేవారు, కానీ ఇప్పుడు వెంటనే రిజెక్ట్ చేసి సమాచారం ఇస్తున్నారని తెలుస్తోంది.

రైతులకు ఇబ్బందులు

భూములు 22ఏ జాబితాలో ఉంటే రైతు భరోసా వంటి పథకాలు రైతులకు వర్తించడం లేదు. రైతుల హక్కులు కలిగిన భూములను కూడా 22ఏ జాబితాలోకి, జీరో ఖాతాలోకి చేర్చారన్న విమర్శలు వస్తున్నాయి. దీనివల్ల రైతులు తమ హక్కులను కోల్పోతున్నారు. ఈ భూములను ఆన్‌లైన్ చేసి 1బీలో చేర్చాల్సిన అవసరం ఉంది.

'చినబాబు' హస్తం ఉంటేనే కదలిక?

జిల్లాలో ఏ ఫైల్ కదలాలన్నా 'చినబాబు' సహకారం ఉండాలి. ప్రభుత్వ భూములు లేదా 22ఏ జాబితాలోని భూములు బయటకు రావాలంటే అతని సిఫార్సు తప్పనిసరిగా ఉండాలన్న ఆరోపణలున్నాయి. చినబాబు సిఫార్సు చేస్తేనే ఎలాంటి భూముల ఫైలైనా క్షణాల్లో కదలిక వస్తోందన్న ఆరోపణలు వస్తున్నాయి.



జిరాయితీ భూములకు 22ఏ భయం

కొంతమంది రెవెన్యూ అధికారులు కావాలనే జిరాయితీ భూములను 22ఏ జాబితాలో చేరుస్తున్నారని, ఉన్నతాధికారులు కూడా దీనికి ఆమోద ముద్ర వేస్తున్నారని విమర్శలు ఉన్నాయి. 22ఏలో చేర్చిన తర్వాత దాన్ని బయటకు తీసుకురావడం చాలా కష్టంతో కూడుకున్న పనిగా చెబుతున్నారు.

అడ్డంకిగా సబ్ డివిజన్

కొన్ని సర్వే నంబర్లను 22ఏలో చేర్చడం వల్ల సబ్ డివిజన్ కావడం లేదు. దీనివల్ల అనేక భూములకు మోక్షం లభించడం లేదు. చాలా సర్వే నంబర్లను సబ్ డివిజన్ చేస్తే ఎంతోమంది 22ఏ నుంచి బయటపడతారని, అయితే అందుకు ఎవరూ సహకరించడం లేదని సమాచారం. దీనివల్ల చాలామంది ఇళ్లు నిర్మించుకున్నా రిజిస్ట్రేషన్ చేసుకోలేక నివసిస్తున్నారు.

వరలక్ష్మీ నమోస్తుతే



కన్యకా పరమేశ్వరి ఆలయంలో కుంకుమ పూజలు

- ఘనంగా సామూహిక వరలక్ష్మీ వ్రతాలు
- 3,100 మంది మహిళలు ఆచరణ
- లక్ష్మీదేవి నామస్మరణలతో హోరెత్తిన సింహగిరి



సింహగిరిపై సామూహిక వరలక్ష్మీవ్రతాలను ఆచరిస్తున్న మహిళలు

సింహాచలం: శ్రావణ శుక్రవారం సందర్భంగా సింహాచలంలోని శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి క్షేత్రం భక్తులతో కిటకిటలాడింది. దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత సామూహిక వరలక్ష్మి వ్రతంలో 3,100 మంది మహిళలు పాల్గొన్నారు. దేవస్థానం ఈవో వి.త్రినాథరావు వ్రతాలను ప్రారంభించారు. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు మూడు విడతలుగా ఈ వ్రతాలు జరిగాయి. పూజలో పాల్గొన్న భక్తులకు దేవస్థానం తరఫున పసుపు, కుంకుమ, కలశం, గాజులు, రవికె, ప్రసాదం వంటి సామగ్రిని ఉచితంగా అందించారు. అలాగే, కొండపైన ఉచిత బస్సు సౌకర్యం, అన్నప్రసాదం, ఉచిత దర్శనం కల్పించారు. దేవస్థానం స్థానాచార్యులు టీపీ రాజగోపాల్, ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, కరి సీతారామాచార్యులు, ఆలయ ఏఈవో తిరుమలేశ్వరరావు, సూపరింటెండెంట్‌లు సత్య శ్రీనివాస్, గాయత్రి, మూర్తి, అర్చకులు, వేదపండితులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో..

డాబాగార్డెన్స్: శ్రావణమాసం చివరి శుక్రవారం సందర్భంగా నగరంలోని ఆలయాలు కూడా భక్తులతో కిటకిటలాడాయి. బురుజుపేటలోని కనకమహాలక్ష్మి అమ్మవారు స్వర్ణాలంకరణలో దర్శనమిచ్చారు. 250 మంది గృహిణులతో ఉచిత సామూహిక వరలక్ష్మి వ్రతం నిర్వహించారు. ఆలయ ఈవో శోభారాణి, ఏఈవోలు కె.రాజేంద్రకుమార్, ఎస్.ఆనంద్‌కుమార్, పర్యవేక్షకుడు కనకరాజు పాల్గొన్నారు. కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారిని స్వర్ణాభరణాలతో అలంకరించి, ప్రత్యేక కుంకుమ పూజలు, సామూహిక లలితా సహస్రనామ పారాయణం నిర్వహించారు. పలువురు భక్తులు తమ ఇళ్లల్లోనూ వరలక్ష్మి వ్రతాలు జరుపుకున్నారు. ఈ పూజలతో నెలరోజుల శ్రావణ మాస వేడుకలు ఘనంగా ముగిశాయి.దేవస్థాన ఆస్థాన పురోహితుడు ఆర్‌బీబీ కుమారశర్మ, దేవస్థానం అధ్యక్షుడు ఆరిశెట్టి దినకర్, కార్యదర్శి పెనుగొండ కామరాజు, ఉత్సవ కార్యనిర్వాహక సభ్యులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఒప్పుకోం

వైఎస్సార్ సీపీ కార్పొరేటర్ల నిరసన

డాబాగార్డెన్స్: వైజాగ్ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను నిరసిస్తూ వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లు జీవీఎంసీ కౌన్సిల్ సమావేశంలో తమ గళం వినిపించారు. ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంట్రెస్ట్(ఈవోఐ) పేరుతో కేంద్ర ప్రభుత్వం స్టీల్ ప్లాంట్‌లోని 44 విభాగాలను ప్రైవేటీకరించడాన్ని వ్యతిరేకిస్తూ వారు శుక్రవారం జీవీఎంసీ ప్రధాన గేటు వద్ద నల్లదుస్తులు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు కార్పొరేటర్లు మీడియాతో మాట్లాడారు.



జీవీఎంసీ ప్రధాన కార్యాలయం గేటు వద్ద నిరసన తెలుపుతున్న వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లు

ఉద్యమాల ఫలితంగానే స్టీల్‌ప్లాంట్



ఉద్యమాల ఫలితంగానే విశాఖ స్టీల్‌ప్లాంట్ ఏర్పడింది. మా ప్రభుత్వ హయాంలో స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ తీర్మానం చేసి రాష్ట్ర ప్రభుత్వానికి పంపాం. స్టీల్‌ప్లాంట్ ప్రైవేట్‌పరం కాకుండా అడ్డుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉంది. – బాణాల శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ ఫ్లోర్ లీడర్

దశల వారీగా ప్రైవేటీకరణ చేస్తున్నారు



స్టీల్‌ప్లాంట్‌ను దశల వారీగా ప్రైవేటీకరణ చేస్తున్నారు. కౌన్సిల్‌లో ఈ అంశంపై గట్టిగా గళం వినిపిస్తాం. ప్లాంట్‌లోని కీలక విభాగాలను 44 ముక్కలుగా చేసి ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించడం దారుణం.
– కె.సతీష్, డిప్యూటీ మేయర్, జీవీఎంసీ

ఉద్యోగులను తొలగించడం బాధాకరం



తెన్నేటి విశ్వనాథం స్ఫూర్తితోనే స్టీల్‌ప్లాంట్ ఏర్పాటుకు నాంది పడింది. ఎంతోమంది త్యాగాలతో సాధించుకున్న స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేట్ పరం చేయడమే కాకుండా, ఉద్యోగులను తొలగించడం బాధాకరం.
– రెయ్యి వెంకటరమణ, కార్పొరేటర్

గతంలో సభ్యులందరి సమన్వయంతో..



విశాఖ ఉక్కు.. ఆంధ్రుల హక్కు. ఎంతో మంది త్యాగాల ఫలితంగా ఏర్పడిన స్టీల్‌ప్లాంట్‌ను కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరించే ప్రయత్నం చేస్తుండటం బాధాకరం. గతంలో విశాఖ ప్రజల మనోభావాలను దృష్టిలో పెట్టుకుని కౌన్సిల్‌లోని అన్ని పార్టీల (వైఎస్సార్ సీపీ, టీడీపీ, జనసేన, బీజేపీ, సీపీఎం, సీపీఐ) సభ్యులను సమన్వయపరచి, తీర్మానం చేసి అప్పటి రాష్ట్ర ప్రభుత్వానికి పంపాం. అది కేంద్రానికి చేరింది. ఇప్పుడు ఈ అంశం మళ్లీ తెరపైకి వచ్చింది. సభ్యులందర్నీ సమన్వయపరచి ప్రభుత్వానికి తీర్మానం పంపడంలో ఎందుకు ఆలోచిస్తున్నారు? దాదాపు ఈ విషయాన్ని రెండు గంటల పాటు నాన్చడంలో అర్థమేంటి?
– గొలగాని హరి వెంకటకుమారి, మాజీ మేయర్

కాంట్రాక్ట్ కార్మికుల పొట్టలు కొట్టారు



స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణలో భాగంగా వేలాది మంది కాంట్రాక్ట్ కార్మికుల పొట్ట కొట్టారు. ఇప్పుడు ఆయా కుటుంబాలు రోడ్డున పడ్డాయి. ఈవోఐ కింద 44 విభాగాలకు టెండర్లు పిలిస్తే, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ఏం చేస్తున్నారు. విశాఖ ప్రజల మనోభావాలు దృష్టిలో పెట్టుకుని కూటమి ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తెచ్చి ప్రైవేటీకరణ ఆపాలి.
– పి.వి.సురేష్, కార్పొరేటర్

అంచనాలకు మించి ఎగుమతులు

- తొలి త్రైమాసికంలో 9.82 శాతం వృద్ధి
- దువ్వాడ వీఎస్‌ఈజెడ్ డీసీ శ్రీనివాస్ వెల్లడి

అగనంపూడి: దువ్వాడ వీఎస్‌ఈజెడ్(విశాఖపట్నం ప్రత్యేక ఆర్థిక మండలి) అంచనాలకు మించి ఎగుమతులతో దూసుకుపోతోంది. మొదటి త్రైమాసికంలో (2025 ఏప్రిల్ నుంచి జూన్ వరకు) రూ.58,565 కోట్ల విలువైన వస్తు, సేవలను ఎగుమతి చేయగలిగామని వీఎస్‌ఈజెడ్ డెవలప్‌మెంట్ కమిషనర్ ముప్పాళ్ల శ్రీనివాస్ వెల్లడించారు. గత ఏడాదితో పోలిస్తే 9.82 శాతం వృద్ధి రేటు సాధించామన్నారు. దువ్వాడ వీఎస్‌ఈజెడ్ పరిపాలన భవనంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. గత ఏడాది తొలి మూడు నెలలతో పోల్చితే ఈసారి మెరుగైన ప్రగతి సాధించగలిగామన్నారు. ఇందులో



రూ. 42,766 కోట్ల విలువైన సేవలు, రూ.15,799 కోట్ల విలువైన వస్తువులను విదేశాలకు ఎగుమతి చేసి, విదేశీ మారక ద్రవ్యాన్ని రాబట్టగలిగామన్నారు.

అలాగే దువ్వాడ సెజ్ రూ.1,834 కోట్ల ఎగుమతులు సాధించి 156 శాతం వృద్ధిని నమోదు చేసిందన్నారు. ఇప్పటి వరకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో 9 కొత్త యూనిట్ల ఏర్పాటుకు అనుమతులు మంజూరు చేసినట్లు శ్రీనివాస్ వివరించారు. ఈ ఆర్థిక మండలి పరిధిలో ఇప్పటివరకు 6,03,474 మందికి ఉపాధి కల్పించినట్లు చెప్పారు. ఈ లక్ష్యాన్ని చేరుకోవడంలో సెజ్‌లు, యూనిట్ల యాజమాన్యం, ఉద్యోగుల సహకారం ఎంతగానో ఉందని ఆయన అభినందించారు.

‘ఆహా ఏమి రుచులు’ రెస్టారెంట్‌పై దాడులు

85 కిలోల నిల్వ ఆహారం
సీజ్ చేసిన ఫుడ్‌సేఫ్టీ అధికారులు

ఎంవీపీకాలనీ: ఎంవీపీకాలనీలోని ‘ఆహా ఏమి రుచులు’రెస్టారెంట్‌పై ఫుడ్‌సేఫ్టీ విభాగం అధికారులు శుక్రవారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. విశ్వసనీయ సమాచారంతో నిర్వహించిన ఈ దాడుల్లో దాదాపు 85 కిలోల నిల్వ ఆహార పదార్థాలు పట్టుబడ్డాయి. వీటిలో ప్రధానంగా చికెన్, చేపలు, రొయ్యలు, ఇతర మాంసం ఉత్పత్తులు ఉన్నాయి. వీటి విలువ సుమారు రూ.45,630 ఉంటుందని అధికారులు అంచనా వేశారు. నిల్వ ఉంచిన ఈ ఆహారాన్ని వినియోగదారులకు అవసరమైనప్పుడు ఉపయోగించేందుకు రెస్టారెంట్ యాజమాన్యం సిద్ధంగా ఉంచుతున్నట్లు అధికారులు గుర్తించారు. ఈ సందర్భంగా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ అప్పారావు మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా నిల్వ ఉంచిన 85 రకాల ఆహార పదార్థాలను


నిల్వ ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న ఫుడ్ ఇన్‌స్పెక్టర్ అప్పారావు

గుర్తించామన్నారు. వీటిలో కొన్ని శాంపిల్స్ సేకరించి, పరీక్షల కోసం ల్యాబ్‌కు పంపించినట్లు చెప్పారు. నిబంధనలు పాటించని రెస్టారెంట్ యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. దాడుల్లో స్థానిక శానిటరీ ఇన్‌స్పెక్టర్ పాల్గొన్నారు.

కానిస్టేబుల్ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన

ఆరిలోవ: కైలాసగిరి ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీస్ మైదానంలో కానిస్టేబుళ్లుగా ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియ ఉత్సాహంగా సాగింది. ఉమ్మడి విశాఖ జిల్లా నుంచి ఎంపికైన అభ్యర్థులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఒకే రోజు వందల మందికి ధ్రువపత్రాల పరిశీలన జరగడంతో ఉదయం 6 గంటల నుంచే సందడి నెలకొంది. ఈ ప్రక్రియ కోసం అధికారులు ప్రత్యేకంగా 10 కౌంటర్లు ఏర్పాటు చేశారు. మొత్తం 659 మంది అభ్యర్థుల్లో 627 మంది హాజరయ్యారు. 32 మంది గైర్హాజరయ్యారు. ఎంపికైన 70 మంది మహిళా అభ్యర్థుల్లో 69 మంది హాజరు కాగా, వారి కోసం ప్రత్యేకంగా రెండు కౌంటర్లు ఏర్పాటు చేశారు. అదనపు ఎస్పీలు ఎం.దేవప్రసాద్, ఎల్.మోహనరావు పర్యవేక్షణలో సర్టిఫికెట్ల పరిశీలన జరిగింది. ఏఆర్ డీఎస్పీ పి.నాగేశ్వరరావు, సైబర్ సెల్ ఇన్‌స్పెక్టర్ బి.వెంకటరావు, ఆర్‌ఐలు మన్మథరావు, రామకృష్ణారావు, జిల్లా అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సిహెచ్.తిలక్ బాబు తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఆరేళ్ల తర్వాత కబడ్డీ పండగ

- ప్రో కబడ్డీకి పోర్టు స్టేడియంలో ఏర్పాట్లు
- 29న తమిళ్ తలైవాస్‌తో తెలుగు టైటాన్స్ ఢీ

విశాఖ స్పోర్ట్స్: ఆరేళ్ల విరామం తర్వాత.. కబడ్డీ అభిమానుల నిరీక్షణకు తెరదించుతూ ప్రో కబడ్డీ లీగ్(పీకేఎల్) తిరిగి విశాఖపట్నానికి వస్తోంది. 12వ సీజన్ తొలి దశ పోటీలకు మహానగరం ఆతిథ్యం ఇవ్వనుండగా.. స్థానిక ఫ్రాంచైజీ తెలుగు టైటాన్స్ సొంత అభిమానుల మధ్య టైటిల్ వేటకు సిద్ధమవుతోంది. గత సీజన్‌లో కేవలం త్రుటిలో ప్లేఆఫ్ అవకాశాన్ని కోల్పోయిన టైటాన్స్.. ఈసారి హోమ్ అడ్వాంటేజ్‌ను సద్వినియోగం చేసుకొని చరిత్ర సృష్టించాలని పట్టుదలగా ఉంది.

యువ, అనుభవాల మేళవింపు : ఈసారి వేలంలో రూ.4.5 కోట్లు ఖర్చు చేసి టైటాన్స్ యాజమాన్యం పక్కా ప్రణాళికతో జట్టు కూర్పు చేసింది. డైనమిక్ ఆల్‌రౌండర్ విజయ్ మాలిక్‌కు జట్టు పగ్గాలు అప్పగించగా.. అతనికి శుభం షిండే డిఫెన్స్‌లో అండగా నిలవనున్నాడు. శంకర్, భరత్, గణేష్ ఆల్‌రౌండ్ ప్రతిభ చూపనున్నారు. రైడింగ్‌లో చేతన్, నితిన్, ప్రఫుల్, జై భగవాన్, మంజీత్, ఆశీష్ వంటి స్టార్లతో పటిష్టంగా కనిపిస్తోంది. అజీత్, సాగర్, అంకిత్ వంటి యువ డిఫెండర్లను అనుభవంతో సమతుల్యం చేసి, ఒత్తిడిని అధిగమించేలా వ్యూహాలు రచించింది. ఈసారి జట్టు కూర్పు టైటిల్ ఫేవరెట్‌గా బరిలోకి దిగేందుకు ఆత్మవిశ్వాసాన్ని ఇస్తోంది.

విశాఖలో టైటాన్స్ షెడ్యూల్ ఇదే.. : అక్కయ్యపాలెంలోని పోర్ట్ ఇండోర్ స్టేడియం వేదికగా ఫ్లడ్‌లైట్ల వెలుతురులో ఈ నెల 29న తెలుగు టైటాన్స్ వర్సెస్ తమిళ్ తలైవాస్ మధ్య సీజన్ ప్రారంభ మ్యాచ్ జరగనుంది. 30న యూపీ యోధాస్‌తో, సెప్టెంబర్ 4న జైపూర్ పింక్ పాంథర్స్‌తో, 7న బెంగాల్ వారియర్స్‌తో, 10న యు ముంబతో టైటాన్స్ జట్టు తలపడనుంది. విశాఖ వేదికగా ప్రతి రోజూ రెండు మ్యాచ్‌లు చొప్పున మొత్తం 28 లీగ్ మ్యాచ్‌లు జరగనుండటంతో.. నగరంలో కబడ్డీ ఫీవర్ తారస్థాయికి చేరనుంది.


తెలుగు టైటాన్స్ జట్టు

ప్రతి మ్యాచ్ కీలకం

విశాఖలో లీగ్ తొలి దశను ప్రారంభిస్తుండటం చాలా ఆనందంగా ఉంది. సొంత అభిమానుల మధ్య సీజన్‌ను విజయంతో ప్రారంభించి, తప్పకుండా ప్లేఆఫ్‌కు చేరుతామన్న నమ్మకం మాకుంది. లీగ్ దశలో మొదటి ఆరు జట్లే తదుపరి దశకు అర్హత సాధిస్తాయి. కాబట్టి విశాఖలో జరిగే ప్రతి మ్యాచ్ మాకు అత్యంత కీలకం.
– శ్రీనివాస్, తెలుగు టైటాన్స్ యజమాని

ప్రోత్సాహమే.. మాకు ఉత్సాహం

ఆరేళ్ల తర్వాత విశాఖకు ప్రో కబడ్డీని తిరిగి తీసుకురావడం మంచి పరిణామం. సీజన్ తొలి మ్యాచ్‌ను హోమ్ టీమ్ టైటాన్స్‌తో ప్రారంభించడం అభిమానులకు పండగలాంటిది. విశాఖలో లభించే మద్దతు, అభిమానుల ప్రోత్సాహం ఈసారి మా జట్టును ప్లేఆఫ్‌కు చేర్చడంలో కీలక పాత్ర పోషిస్తాయని బలంగా నమ్ముతున్నాం.
– త్రినాథ్, తెలుగు టైటాన్స్ సీఈవో

ఏపీఎల్ ఫైనల్‌లో తుంగభద్ర, అమరావతి ఢీ

విశాఖ స్పోర్ట్స్: ఏపీఎల్ నాలుగో సీజన్ టైటిల్ కోసం తుంగభద్ర వారియర్స్, అమరావతి రాయల్స్ జట్లు తలపడనున్నాయి. శుక్రవారం వైఎస్సార్ ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో జరిగిన క్వాలిఫైయర్-2 మ్యాచ్‌లో భీమవరం బుల్స్‌పై తుంగభద్ర వారియర్స్ విజయం సాధించి ఫైనల్‌లోకి అడుగుపెట్టింది. టాస్ ఓడి భీమవరం బుల్స్ బ్యాటింగ్ ప్రారంభించింది. ఓపెనర్లు హిమకర్ (23), రేవంత్ (19) జట్టుకు మంచి ఆరంభాన్ని ఇచ్చారు. కానీ, కెప్టెన్ హేమంత్ కేవలం 7 పరుగులకే వెనుదిరగడంతో బుల్స్ 62 పరుగులకే మూడు కీలక వికెట్లు కోల్పోయింది. ఈ దశలో సాయిశ్రవణ్ (71) అర్ధసెంచరీతో రాణించగా, యువన్ (41) సహకారం అందించాడు. దీంతో భీమవరం బుల్స్ నిర్ణీత ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 183 పరుగులు చేసింది. తుంగభద్ర బౌలర్లలో దీపక్ 4 వికెట్లు పడగొట్టాడు. 184 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన తుంగభద్ర వారియర్స్‌కు శుభారంభం దక్కలేదు. ఓపెనర్ జ్ఞానేశ్వర్ డకౌట్ కాగా, మరో ఓపెనర్ కేవలం 7 పరుగులే చేశాడు. కెప్టెన్ మహీప్ కుమార్ (8) కూడా తక్కువ స్కోరుకే అవుటయ్యాడు. కానీ.. వన్‌డౌన్‌లో వచ్చిన రోహిత్ (87) అద్భుతమైన ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నాడు. అతనికి ప్రశాంత్ (64) తోడై నాలుగో వికెట్‌కు 125 పరుగుల భారీ భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. ఈ ఇద్దరి మెరుపు బ్యాటింగ్‌తో తుంగభద్ర విజయం దిశగా సాగింది. చివర్లో దత్తరెడ్డి (14) మరో ఓవర్ మిగిలి ఉండగానే జట్టును గెలిపించాడు. భీమవరం బుల్స్ బౌలర్లలో శంకర్, సత్యనారాయణ చెరో రెండు వికెట్లు తీశారు.

రైల్వే బాల్‌బ్యాడ్మింటన్ విజేత ఐసీఎఫ్

విశాఖ స్పోర్ట్స్ : ఆల్ ఇండియా రైల్వే బాల్‌బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌ను ఐసీఎఫ్ జట్టు గెలుచుకోగా, సదరన్ రైల్వే జట్టు రన్నరప్‌గా నిలిచింది. శుక్రవారంతో రైల్వే స్టేడియంలో ముగిసిన ఈ టోర్నీలో ఏడు రైల్వే జోన్ జట్లు పాల్గొన్నాయి. చివరిరోజు జరిగిన పోటీల్లో ఐసీఎఫ్ రెండు మ్యాచ్‌లలో విజయం సాధించి ఆధిక్యతను ప్రదర్శించింది. ఎస్ఆర్, ఎస్‌సీ, ఈకో రైల్వే జట్లు ఒక్కో మ్యాచ్‌లో విజయం సాధించాయి. దీంతో లీగ్ రౌండ్ రాబిన్ పద్ధతిలో జరిగిన ఈ పోటీల్లో ఐసీఎఫ్ మొదటి స్థానంలో నిలవగా, ఎస్ఆర్, డబ్ల్యూఆర్ జట్లు వరుసగా రన్నరప్, సెకండ్ రన్నరప్‌గా నిలిచాయి. ఎస్‌సీ, ఈకో రైల్వే, ఎస్‌డబ్ల్యూ, ఎస్ఈ జట్లు ఆ తర్వాత స్థానాలతో టోర్నీని ముగించాయి. పోటీల ముగింపు కార్యక్రమానికి ఈకో రైల్వే అదనపు జీఎం బీఎస్‌కే రాజ్‌కుమార్ హాజరై విజేతలకు ట్రోఫీలను అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్ఎం లలిత్ బోహ్రా, రైల్వే అధికారులు అజయ్ సమాల్, మనోజ్‌కుమార్, శాంతారాం, హరనాథ్, కబీర్ అన్సారీ తదితరులు పాల్గొన్నారు.


విజేతకు ట్రోఫీ అందజేస్తున్న రైల్వే అధికారులు

విశాఖలో ‘సుందరకాండ’ సందడి

ఏయూక్యాంపస్: ‘సుందరకాండ’ సినిమా ఒక మంచి కుటుంబ కథా చిత్రంగా ప్రేక్షకులను ఆకట్టుకుంటుందని హీరో నారా రోహిత్ అన్నారు. ఈ నెల 27న విడుదలకు సిద్ధమవుతున్న ఈ సినిమా విశేషాలను మీడియాకు వివరించారు. శుక్రవారం సాయంత్రం బీచ్‌రోడ్డులోని ఒక హోటల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో నారా రోహిత్ మాట్లాడుతూ, ‘సుందరకాండ’ చిత్రం అందరి హృదయాలను తాకుతుందన్నారు. ఈ చిత్రానికి వెంకటేష్ నిమ్మలపూడి దర్శకత్వం వహించారు. కథానాయిక శ్రీదేవి విజయ్ కుమార్ మాట్లాడుతూ, ఇది రొమాంటిక్ కామెడీ చిత్రమని, అందరినీ అలరిస్తుందని పేర్కొన్నారు. మరో కథానాయిక వ్రితి వాఘని మాట్లాడుతూ, మంచి కథతో రూపొందించిన ఈ చిత్రం తప్పకుండా అందరినీ ఆకట్టుకుంటుందని తెలిపారు. ఈ సినిమాను ప్రేక్షకులందరూ ఆదరించి, తమను ఆశీర్వదించాలని నిర్మాత సంతోష్ కోరారు.

16వ బెటాలియన్ కమాండెంట్‌గా అరుణ్

పీఎంపాలెం : ఏపీఎస్‌పీ 16వ బెటాలియన్‌కు నూతన కమాండెంట్‌గా ఎం. అరుణ్ బోస్ నియమితులయ్యారు. శుక్రవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఇంతకుముందు నెల్లూరులోని వెంకటగిరి 9వ పోలీస్ బెటాలియన్‌లో అడిషనల్ కమాండెంట్‌గా పనిచేసిన ఆయన, కమాండెంట్‌గా పదోన్నతి పొంది ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బెటాలియన్ సిబ్బంది, అధికారుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాననిచెప్పారు. అధికారులు ఆయనకు పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలిపి, స్వాగతం పలికారు. బెటాలియన్ అడిషనల్ కమాండెంట్ ఎం. శ్రీనివాసరావు, అసిస్టెంట్ కమాండెంట్లు పి. సత్యం, ఎన్. మురళీధర్, జి. ఇలియాసాగర్, వి. నారాయణరావు పాల్గొన్నారు.


అరుణ్ బోస్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న అధికారులు

నేడు స్వచ్ఛాంధ్ర–స్వర్ణాంధ్ర



మహారాణిపేట: ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, సామాజిక కార్యకర్తల భాగస్వామ్యంతో స్వచ్ఛాంధ్ర–స్వర్ణాంధ్ర కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆగస్టు థీమ్ అయిన ‘వర్షాకాలం పరిశుభ్రత’కు అనుగుణంగా కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. శనివారం నిర్వహించే ప్రత్యేక కార్యక్రమాల్లో భాగంగా డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధుల నివారణకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఇళ్లు, కార్యాలయాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, మురుగునీటి కాలువలను, తాగునీటి వ్యవస్థలను శుభ్రం చేయాలని ఆదేశించారు. దోమల నివారణకు ఫాగింగ్, పరిశుభ్రతపై ఇంటింటికి అవగాహన కల్పించాలని సూచించారు. అత్యంత పరిశుభ్రత పాటించిన వారికి రాష్ట్ర ప్రభుత్వ స్వచ్ఛ అవార్డులు ఇవ్వనున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. ఉత్తమ మున్సిపాలిటీ, ఉత్తమ గ్రామ పంచాయతీ, పాఠశాల, ఆసుపత్రి వంటి విభాగాలతో పాటు స్వచ్ఛ వారియర్స్ (పట్టణాల్లో), గ్రీన్ అంబాసిడర్స్ (గ్రామీణంలో) పేరిట అవార్డులు ఉంటాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాలకు సంబంధించిన నివేదికలు, ఛాయాచిత్రాలను సాసా (ఎస్ఏఎస్ఏ) ప్లాట్‌ఫాంలో షేర్ చేయాలని అధికారులకు సూచించారు.

సముద్రంలో మునిగిన బోటు

సురక్షితంగా బయటపడిన మత్స్యకారులు

మహారాణిపేట: విశాఖ సాగర తీరంలో చేపల వేటకు వెళ్లిన ఒక మరబోటు ప్రమాదవశాత్తు మునిగిపోయింది. అయితే అందులో ఉన్న ఐదుగురు మత్స్యకారులు క్షేమంగా ఒడ్డుకు చేరుకున్నారు. ఈ సంఘటన శుక్రవారం జరిగింది. ఉదయం 4.30 గంటల సమయంలో ఐదుగురు మత్స్యకారులతో కూడిన ఐఎన్‌డీ ఏపీవీ5 ఎంఎం 817 నంబరు గల మరబోటు చేపల వేట కోసం సముద్రంలోకి వెళ్లింది. వేట కొనసాగిస్తున్న సమయంలో బోటులోకి అకస్మాత్తుగా నీరు చేరి మునిగిపోవడం ప్రారంభమైంది. ప్రమాదాన్ని పసిగట్టిన జాలర్లు వెంటనే సముద్రంలోకి దూకి తమ ప్రాణాలను కాపాడుకున్నారు. కొంతసేపు ఈత కొట్టిన తర్వాత సమీపంలో ఉన్న మరో బోటు కనిపించడంతో దాని సహాయంతో వారు ఒడ్డుకు చేరుకున్నారు. క్షేమంగా ఒడ్డుకు చేరుకున్న జాలర్లలో వాసుపల్లి తులసీరావు, వాసుపల్లి రమేష్, పుక్కళ్ల హరికృష్ణ, అబ్దుల్ ఘోస్, చింతపల్లి గురుమూర్తి ఉన్నారు. వారందరూ ఫిషింగ్ హార్బర్‌లోని ఏపీ మరపడవ సంఘం కార్యాలయానికి చేరుకుని, తాము పడ్డ ఇబ్బందులను వివరించారు. ఈ విషయాన్ని ఏపీ మెకనైజ్డ్ ఫిషింగ్ బోట్ అసోసియేషన్ అధ్యక్షుడు మైలపల్లి లక్ష్మణరావు మత్స్యశాఖ జేడీ లక్ష్మణరావుకు తెలియజేశారు.

స్పెషల్ రైళ్లు మరికొంతకాలం పొడిగింపు

తాటిచెట్లపాలెం: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా వారి సౌకర్యార్థం ప్రస్తుతం నడుస్తున్న పలు ప్రత్యేక రైళ్లు మరికొంత కాలం పొడిగిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ సందీప్ తెలిపారు.

- భువనేశ్వర్–యశ్వంత్‌పూర్(02811) వీక్లీ ఏసీ స్పెషల్ ప్రతీ శనివారాలలో భువనేశ్వర్‌లో రాత్రి 7.15గంటలకు బయల్దేరి సోమవారాలలో తెల్లవారు(ఆదివారం మధ్యరాత్రి) 12.15గంటలకు యశ్వంత్‌పూర్ చేరుకుంటాయి. ఈస్పెషల్ రైళ్లు సెప్టెంబరు 13 నుంచి నవంబరు 29వ తేదీ వరకు నడుస్తాయి. తిరుగు ప్రయాణంలో యశ్వంత్‌పూర్–భువనేశ్వర్ (02812) వీక్లీ ఏసీ స్పెషల్ ప్రతీ సోమవారాలలో తెల్లవారు 4.30గంటలకు బయల్దేరి మరుసటిరోజు మధ్యాహ్నం 12.15గంటలకు భువనేశ్వర్ చేరుకంటాయి. ఈ స్పెషల్ రైళ్లు సెప్టెంబరు 15 నుంచి డిసెంబరు 1వ తేదీ వరకు నడుస్తాయి.
- విశాఖ–ఎస్ఎంవీ బెంగళూరు(08581) వీక్లీ స్పెషల్ ప్రతీ ఆదివారాలలో విశాఖపట్నంలో మధ్యాహ్నం 3.20గంటలకు బయల్దేరి, మరుసటిరోజు మధ్యాహ్నం 12.45గంటలకు బెంగళూరు చేరుకుంటుంది. ఈ స్పెషల్ రైలు సెప్టెంబర్ 14 నుంచి నవంబరు 30వ తేదీ వరకు నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో ఎస్ఎంవీ బెంగళూరు–విశాఖపట్నం (08582) వీక్లీ స్పెషల్ ఎస్ఎంవీ బెంగళూరులో ప్రతీ సోమవారం మధ్యాహ్నం 3.50గంటలకు బయల్దేరు మరుసటిరోజు మధ్యాహ్నం 1.30గంటలకు విశాఖ చేరుకుంటుంది. ఈ స్పెషల్ రైళ్లు సెప్టెంబరు 15 నుంచి డిసెంబరు 1వ తేదీ వరకు నడుస్తుంది.
- విశాఖపట్నం–తిరుపతి(08547)వీక్లీ స్పెషల్ విశాఖలో ప్రతీ బుధవారం రాత్రి 7గంటలకు బయల్దేరి మరుసటి రోజు ఉదయం 9.15 గంటలకు తిరుపతి చేరుకుంటుంది. ఈ స్పెషల్ రైలు అక్టోబరు 1వ తేదీ నుంచి నవంబరు 26వ తేదీ వరకు నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో తిరుపతి–విశాఖ(08548) స్పెషల్ తిరుపతిలో ప్రతీ గురువారాలలో రాత్రి 9.50గంటలకు బయల్దేరి, మరుసటిరోజు ఉదయం 11.30గంటలకు విశాఖ చేరుకుంటుంది. ఈ స్పెషల్ రైలు అక్టోబరు 2 నుంచి నవంబరు 27 వరకు నడుస్తుంది.
- విశాఖ–చర్లపల్లి(08579) వీక్లీ స్పెషల్ ప్రతీ శుక్రవారాలలో సాయంత్రం 5.30గంటలకు విశాఖలో బయల్దేరి మరుసటిరోజులలో ఉదయం 8గంటలకు చర్లపల్లి చేరుకుంటుంది. ఈ స్పెషల్ రైలు అక్టోబరు 3 నుంచి నవంబరు 28 వరకు నడుస్తుంది. తిరుగుప్రయాణంలో చర్లపల్లి– విశాఖ(08580)వీక్లీ స్పెషల్ శనివారాలలో మధ్యాహ్నం 3.30గంటలకు చర్లపల్లిలో బయల్దేరి మరుసటిరోజు ఉదయం 7గంటలకు విశాఖ చేరుకుంటుంది. ఈ స్పెషల్ రైలు అక్టోబరు 4వ తేదీ నుంచి నవంబరు 29వ తేదీ వరకు నడుస్తుంది.

యూరియా కొరత లేకుండా విజిలెన్స్ నిఘా

ఎంవీపీకాలనీ: యూరియా సరఫరాలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యల దృష్ట్యా, అక్రమ రవాణా, అధిక ధరల విక్రయాలపై నిఘా పెట్టినట్లు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం ప్రకటించింది. ప్రస్తుతం రైతుల అవసరాలకు సరిపడా యూరియా నిల్వలు ఉన్నాయని జిల్లా వ్యవసాయ అధికారులు స్పష్టం చేశారు. కొందరు వ్యాపారులు అధిక ధరలకు అమ్ముకోవడానికి కృత్రిమ కొరత సృష్టిస్తున్నారని, ఈ నేపథ్యంలో అక్రమ రవాణా, నిల్వలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అక్రమ రవాణా లేదా నిల్వల గురించి సమాచారం ఉంటే 94402 00104, 90591 50042కు తెలియజేయాలని సూచించారు.

ఆకట్టుకుంటున్న థాయిలాండ్ షాపింగ్ ఫెస్టివల్

కొమ్మాది: రుషికొండ సమీపంలోని రాడిసన్ బ్లూలో నిర్వహిస్తున్న థాయిలాండ్ ఇంటర్నేషనల్ షాపింగ్ ఫెస్టివల్, ఫర్నిచర్, హోమ్ డెకర్ ఎక్స్‌పోకు విశేషమైన స్పందన లభిస్తోంది. అంతర్జాతీయ ఉత్పత్తులు, హస్తకళలు, గృహోపకరణాలు, డిజైన్లకు సంబంధించిన అన్ని రకాల వస్తువులు ఒకేచోట అందుబాటులో ఉండటంతో వినియోగదారులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ ఎక్స్‌పోలో థాయిలాండ్, కొరియా, ఆఫ్ఘనిస్థాన్, యూఏఈ, ఇరాన్, సింగపూర్, లెబనాన్, మలేసియా వంటి దేశాలకు సంబంధించిన ప్రత్యేక స్టాళ్లను ఏర్పాటు చేశారు. థాయిలాండ్ ముత్యాల ఆభరణాలు, సింగపూర్, కొరియా బ్యాగులు, దుబాయ్ ప్రీమియం పెర్ఫ్యూమ్స్, చాక్లెట్లు, ఆఫ్ఘనిస్థాన్ డ్రైఫ్రూట్స్, ఇరాన్ ఆభరణాలు, మిఠాయిలు, మలేసియా స్టైలిష్ అవుట్‌డోర్ ఫర్నిచర్ వంటి ప్రత్యేక ఉత్పత్తులు ఇక్కడ లభిస్తున్నాయి. ఈ ప్రదర్శన మరో మూడు రోజులు మాత్రమే ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. ఆసక్తి ఉన్న వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.


థాయిలాండ్ ముత్యాల ఆభరణాలు